క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తి చేయండి



కల్యాణపురంలో పర్యటిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన ఆర్టీసీ కాలనీ, కేఎన్‌రోడ్డు, షాపు వీధి, దయ్యాలగుంట వీధి, 20వ వార్డు నెత్తం, కల్యాణపురం, విజయనగరం కాలనీ, ముద్దుకృష్ణాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఏ.హరి కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, కౌన్సిలర్ చిట్టిబాబు, నాయకులు చిన్నా, బుజ్జి, జనార్ధన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి



జగనన్న పాలనపై సమాధానం ఇస్తున్న మహిళ

పుత్తూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలు నినదిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ 23వ వార్డులో కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. హరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నవరత్నాల పేరిట అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఇంటికి రూ.3 లక్షల లబ్ధిని చేకూర్చినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మీరు సంతృప్తిగా ఉన్నారా ? అంటూ ప్రశ్నిస్తే సంతృప్తిగా ఉన్నామని సమాధానం వస్తోందన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను సంతోషంగా తమ ఇళ్ల ముందు అతికించుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మునయ్య, బుజ్జి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరిలో..

మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కన్నాయిరం, అయ్యప్పన్, జగన్, అరుణాచలం, మణివాసగం, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కోర్సు పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలను అందిస్తున్న రాస్ అధికారులు

కార్వేటినగరం: సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు బాగు పడుతాయని రాస్ ప్రాజెక్టు అధికారి అన్పళగన్ అన్నారు. రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో 84 రోజుల పాటు బ్యూటీషియన్ కోర్సు ఆఖరి రోజును పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసక్తి కలిగిన మహిళలకు రాస్ ఆధ్వర్యంలో పలు కోర్సులలో శిక్షణ అందించడం జరిగిందన్నారు. అలాగే ఆర్థిక లావాదేవీలతో పాటు వృత్తి పరమైన శిక్షణ, ఆరోగ్య, విద్య, ఉపాధి కార్యక్రమాలు నేర్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళలు దైనందిన కార్యక్రమాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. చివరిగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాస్ అధికారులు ధనలక్ష్మి, చందన, ప్రకాష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరాజుపురం పంచాయతీ అయ్యప్పరాజుకండ్రిగ గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లికి భక్తులు మంగళవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అంబలి పోశారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి పూజకు కావలసిన వివిధ పుష్పాలు, వస్త్రాలను మహిళలు అంబలితో పాటు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులు తీసుకొచ్చిన వివిధ సుగంధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు సాయంత్రం ఆలయ ఆవరణలో పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

బుగ్గ అగ్రహారానికి మణిహారం

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. ఏటా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని తొమ్మిది విభాగాల్లో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి ఆయా జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులను అందిస్తారు. పంచాయతీ తరపున ప్రథమ పౌరుడిగా ఎన్నికైన సర్పంచుకు అవార్డు అందిస్తారు. ఈ ఏడాది ప్రకటించిన అవార్డుల్లో నగరి మండలం బుగ్గ అగ్రహారం గ్రామ పంచాయతీ సామాజిక భద్రత (సోషల్లీ సెక్యూర్డ్) విభాగంలో అవార్డును జెడ్పీచైర్మన్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచ్ రవికుమార్ అవార్డును అందుకున్నారు.



బుగ్గ అగ్రహారం గ్రామ ఆర్బీకే కేంద్రం

- ఉత్తమ పంచాయతీగా బుగ్గ అగ్రహారం
- సామాజిక భద్రత విభాగంలో పంచాయతీకి అవార్డు
- ప్రభుత్వం, గ్రామస్తుల సహకారంతోనే సాధ్యమైందన్న సర్పంచ్
- సంబరాలు చేసుకున్న గ్రామస్తులు

నగరి : నగరి మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామ పంచాయతీలో 412 గృహాలు, 2028 మంది జనాభా, 1132 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలో బుగ్గ అగ్రహారం, బుగ్గఅగ్రహారం ఏఏడబ్ల్యూగా రెండు గ్రామాలున్నాయి. పెద్ద పంచాయతీగా ఉన్న బుగ్గఅగ్రహారం పంచాయతీ విభజనలో భాగంగా బుగ్గ అగ్రహారం, వేలావడి అనే రెండు పంచాయతీలుగా విడిపోయింది. బుగ్గ అగ్రహారం పంచాయతీలో గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.30 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, పక్కా గృహాలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.15 కోట్లు చెల్లించారు. పింఛను నగదు రూ.2.55 కోట్లు, ఆసరా నగదు రూ.1.15 కోట్లు, విద్యాదీవెన కింద రూ.23 లక్షలు, చేయూత పథకం ద్వారా రూ.75 లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.32 లక్షలు, చేయూత, జగనన్న తోడు, విద్యాదీవెన, సున్నావడ్డీ ఇలా మొత్తంగా సంక్షేమం కోసం రూ.15 కోట్లు ఖర్చు చేశారు. అలాగే రూ.10 లక్షల వ్యయంతో రోడ్లు నిర్మించారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సహకారంతో ఏళ్ల తరబడి రోడ్డు లేని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పక్కా రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలు అమర్చారు. సుమారు రూ.35 లక్షల మేర వ్యయంతో తాగునీటి సరఫరాకు చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. గ్రామ సచివాలయాల పరిధిలో సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండడంతో పాటు నిర్వహణ సమర్థవంతంగా ఉండడంతో అధికారులు ఈ పంచాయతీని జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డుకు ఎంపిక కావడంపై అధికారులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామంలో నిర్మించిన సచివాలయం



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రవికుమార్

అందరి సహకారంతోనే..



అందరి సహకారంతో ఉత్తమ సామాజిక భద్రత గ్రామ పంచాయతీగా బుగ్గ అగ్రహారం పంచాయతీ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఏ చిన్న సమస్య వచ్చినా మంత్రి ఆర్‌కే రోజా దృష్టికి తీసుకెళ్లి రోజుల వ్యవధిలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సిబ్బంది, అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపడంతో పాటు సురక్షిత మంచినీరు, వనరుల వినియోగం, వర్మీకంపోస్టు తయారీ కేంద్రం నిర్వహణ, పన్ను వసూళ్ల లక్ష్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

– రవికుమార్, సర్పంచ్, బుగ్గ అగ్రహారం

సంబరాలు చేసుకున్న పంచాయతీ ప్రజలు..

బుగ్గఅగ్రహారం పంచాయతీ జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. యువకులు కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సర్పంచ్ రవికుమార్‌ను, సచివాలయ అధికారులను, ప్రజా ప్రతినిధులను అభినందించారు.

మంత్రి సహకారంతో నింద్ర పంచాయతీ అభివృద్ధి



నింద్ర సర్పంచ్ వసంతబాబురెడ్డిని సన్మానిస్తున్న నేతలు

నింద్ర: జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా నింద్రకు అవార్డు లభించిన విషయం విదితమే. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్ వసంతబాబురెడ్డికి సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దీప మాట్లాడుతూ నింద్రకు ఉత్తమ పంచాయతీగా అవార్డు రావడం గర్వించదగిన విషయమన్నారు. మిగిలిన పంచాయతీల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టి ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. సర్పంచ్ వసంతబాబురెడ్డి మాట్లాడుతూ మంత్రి రోజా సహకారంతో పంచాయతీ పరిధిలో ప్రజలు, నాయకులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందించిన చొరవతో పంచాయతీని అభివృద్ధి చేయగలిగినట్లు ఆమె తెలిపారు. అనంతరం అధికారులు, నాయకులు సిబ్బంది ఆమెను గజమాలతో, శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ వేణు, కోఆప్షన్ సభ్యులు అనిల్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్ లాల్, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ విజేష్, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్, నాయకులు దామోదరం, రామచంద్రయ్య, శివలింగ ఆచారి, సుబ్రమణ్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం



కార్వేటినగరం : సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ లత



శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్ బాబును సన్మానిస్తున్న అధికారులు, గ్రామస్తులు

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకమని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్, అధికారులతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తే గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించవచ్చన్నారు. డీఎం పురం పంచాయతీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని వచ్చే ఏడాది జిల్లాస్థాయిలో అవార్డు వచ్చేలా అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం మండలంలోని 22 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను శాలువలు కప్పి, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్, రాష్ట్ర యువత అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే నా లక్ష్యం

పాలసముద్రం : శ్రీకావేరిరాజుపురం పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి సర్పంచ్ గాలి మహేష్ బాబు కృషి చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ తెలిపారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా గాలి మహేష్ బాబు అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. మంగళవారం ఆయనను సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఎందుకు మూతపడిందో తెలియదా భాను ?

- మీ కుల రాజకీయాల వల్లే కదా షుగర్ ఫ్యాక్టరీ మూతపడింది
- గాలి భానుప్రకాష్‌పై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

నింద్ర : 'కుల రాజకీయాల కారణంగానే కదా నేతమ్స్ షుగర్స్ ఫ్యాక్టరీ మూతపడింది భాను.. నీకు తెలియదా ఆ విషయం ?' అని రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. సోమవారం నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ షుగర్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి సెల్ఫీ తీసి వైఎస్సార్‌సీపీ పాలనలో మంత్రి రోజా ఫ్యాక్టరీ తెరిపించడం లేదని, రైతుల బకాయిలు చెల్లించలేదని పత్రికా ప్రకటనలు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వారు మంగళవారం స్థానిక నేతమ్స్ షుగర్స్ ఫ్యాక్టరీ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతుల బకాయిలు, ఫ్యాక్టరీ తెరిపించడానికి ఆమె అసెంబ్లీలో ప్రస్తావించారని, ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన విషయం మీరు మరచిపోయారా భాను ? అని ప్రశ్నించారు. అలాగే ఆమె జిల్లా కలెక్టర్‌ను కలిసి వేలంద్వారా వచ్చే నగదుతో రైతుల బకాయిలు చెల్లించడానికి కృషి చేయాలని ప్రయతిస్తే, దాన్ని అడ్డుకుంది మీరు కాదా ? అని ప్రశ్నించారు. గతంలో ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య వివాదం చోటు చేసుకుంటే మీ సామాజిక వర్గానికి చెందిన నందకుమార్‌కు మీ తండ్రి ముద్దుకృష్ణమనాయుడు సహకారం అందించలేదా ? అని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే నగరి నియోజకవర్గంలో అభివృద్ధి చెందిందని, దీనిపై తాము చర్చకు ఎప్పుడైనా ఎక్కడైనా సిద్ధమని, మీరు సిద్ధమా ? అని ప్రశ్నించారు. లేనిపోని ఆరోపణలు చేసి మా రోజమ్మను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, కోఆప్షన్ సభ్యులు అనిల్, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, నాయకులు వేణురాజు, బాబురెడ్డి, రామచంద్రయ్య, మునికృష్ణరెడ్డి, సత్యరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



షుగర్ ఫ్యాక్టరీ వద్ద సమావేశమైన నింద్ర నాయకులు

నవరత్నాలే నవశకానికి నాంది

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాం
- ఏ గడప తొక్కినా సీఎం జగనన్నే మాకు భరోసా అంటున్నారు
- అధికారులు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి మంగళ హారతి పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

వెదురుకుప్పం: నవరత్నాలే నవశకానికి నాంది పలికాయని, ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం పేదల పాలిట వరంగా మారిందని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. మంగళవారం నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని అగ్గిచేనుపల్లె, అగ్గిచేనుపల్లె దళితవాడ, పాదలపల్లె, ఎస్టీ కాలనీ, కేవీఎం అగ్రహారం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పాల్గొని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీసి ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం కుంపటి రాజేసే టీడీపీ పాలనలో ఇలాంటి సంక్షేమ పథకాలు ఎన్నడైనా ఇచ్చారా ? అని మహిళలను ప్రశ్నించారు. అధికార వ్యామోహంతో రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వర్గ విభేదాలు సృష్టించి తద్వారా ప్రయోజనం పొందాలని చంద్రబాబు చూస్తున్నారని ఆరోపించారు. పేదలకు మంచి చేయాలని ఆయన ఎప్పుడైనా ఆలోచించారా అని నారాయణ స్వామి ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఏ గడప తొక్కినా జగనన్న పథకాలు తమకు భరోసా కల్పిస్తున్నాయని ప్రజలే చెబుతున్నారని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో మరింత మేలు జరగాలంటే సీఎం జగనన్నను మరోసారి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి..

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామానికి శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని చెప్పారు. మొరవ గ్రామం నుంచి వావిల్‌చేను మీదుగా జక్కిదొన మర్రిచెట్టు వరకు ఉన్న రోడ్డును ఆధునీకరించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని పీఆర్ డీఈ దయాకర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం సంతబయలు గ్రామానికి చెందిన ఎన్ సుమతికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,80,000 చెక్కును అందజేశారు.

సాయం..మేము మరచిపోం..

సీఎం జగనన్న మా కుటుంబానికి అన్ని పథకాలను అందిస్తున్నాడు. ఆయనను మీరు మరచినా, మేము మరువము సార్.. మేమెప్పుడూ జగనన్న వెంటే ఉంటాం.. ఆయన సాయాన్ని ఎన్నటికీ మరచిపోమని అగ్గిచేనుపల్లికి చెందిన మంగమ్మ అనే మహిళ మంత్రి ఎదుట ఆనందం వ్యక్తం చేసింది.

అడుగడుగునా నీరాజనం..

అగ్గిచేనుపల్లె పంచాయతీలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముఖ్యంగా మహిళలు మంగళహారతులు, కర్పూర నీరాజనాలతో అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి ఇంటి వద్ద మంత్రికి దుశ్శాలువలు కప్పి సత్కరించారు. అంతకు ముందు శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీడీఓ సుధాకరరావు, కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్, ఎంపీటీసీ చిన్నబ్బ, సర్పంచ్‌లు రంగారెడ్డి, గోవిందయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, సీనియర్ నాయకుడు పేట ధనుంజయరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, నాయకులు దాము, చంద్రబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వెదురుకుప్పం: మండలంలోని సంతబయలు గ్రామ సమీపంలోని దిగువప్రాంతంలో మంగళవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సెల్‌ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ లోకేష్ కథనం మేరకు సంతబయలు దిగువన ఉన్న అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీన పరచుకున్నారు. అదేవిధంగా రూ.4,150 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆరుగురిలో ముగ్గురు సంతబయలు, చవటగుంట ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించినట్లు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు సంగీత అవధానం

- పుత్తూరుకు పలువురు ప్రముఖుల రాక
- ఏడీకే కల్యాణ మండపం వేదికగా కార్యక్రమం



సాయికృష్ణ యాచేంద్ర



భువనచంద్ర

పుత్తూరు రూరల్: ప్రముఖ అవధానులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర బుధవారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో సంగీత గేయధార అవధాన కార్యక్రమం జరగనుంది. స్థానిక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర పాల్గొంటున్నారు. ప్రముఖ కవి, విమర్శకులు కాసల నాగభూషణం సంచాలకులుగా వ్యవహరించనున్నారు. యాచేంద్ర 405వ గేయధార అవధానంలో ప్రశ్నికులుగా ప్రముఖ శతావధానులు ఆముదాల మురళి, సంగీత సాహిత్య హరికథకులు ఒంటి రవి, ఎస్వీ యూనివర్సిటీ ఉపన్యాసకులు డాక్టర్ పాలూరి బ్రహ్మానందరెడ్డి, రచయిత, సీనియర్ పాత్రికేయులు మన్నవ గంగాధర ప్రసాద్, తెలుగు సాహిత్యాభిమాని సి.శోభారాజు వ్యవహరించనున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, కార్యదర్శి సి.కుప్పయ్య కార్యక్రమం పర్యవేక్షించనున్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



జీడీనెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



తూగుండ్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గంగాధరనెల్లూరు: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జీడీనెల్లూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు సోకే ప్రమాదం ఉందన్నారు. నీటి నిల్వ లేకుండా ఉంటే దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వీలుంటుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తూగుండ్రంలో..

మండలంలోని తూగుండ్రం పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. తూగుండ్రం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ మలేరియా సోకితే విపరీతమైన చలిజ్వరం, ఒళ్లునొప్పులు, రోజుమార్చి రోజు జ్వరం రావడం, చెమటలు పట్టి ఆగిపోవడం దీని లక్షణమన్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే రక్తపరీక్ష చేసుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్, పీహెచ్ఎన్ శాంతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి చేద్దాం

శ్రీరంగరాజపురం : మలేరియా వ్యాధి నివారణకు కృషి చేసి ప్రాణాంతకమైన మలేరియా వ్యాధిని నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ కృషి, సహకారం అవసరమని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. మండలకేంద్రంలో మాట్లాడుతూ ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు, గుంతల్లో నీరు నిల్వ లేకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేడి నీరు కాచి చల్లార్చి తాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్‌రాజ్, సూపర్‌వైజర్ గంగాదేవి, ఫార్మసీ జగదీష్, ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

నింద్ర: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా చేయాలని మండల వైద్యాధికారి కల్యాణి అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, తలనొప్పి, చలి, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశాలలో పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : గ్రామీణ ప్రజలు మలేరియా వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు తెలిపారు. మంగళవారం జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి మోహన్‌కృష్ణ సమక్షంలో ఆరోగ్య సిబ్బందితె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు రాత్రి సమయంలో దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు. ఇంటి ద్వారాలకు, కిటికీలకు మెష్‌లు బిగించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో మరో రెండు పార్కులు



10వ వార్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న వీసీ హరికృష్ణ

- 10వ వార్డులో 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఒకటి
- 24వ వార్డులో 0.59 సెంట్లలో మినీ పార్కు
- స్థల పరిశీలన చేసిన తుడా వీసీ హరికృష్ణ

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీలో మరో రెండు పార్కులు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు సంబంధించి మంగళవారం తుడా వైస్ చైర్మన్ ఎస్.హరికృష్ణ పట్టణంలోని స్థలాలను చూశారు. 10వ వార్డు గోవిందపాళెం లెక్క దాఖలాలో 2.5 ఎకరాల్లో మున్సిపల్ పార్కు, 24వ వార్డుకు చెందిన కాపు వీధి సమీపంలో 0.59 సెంట్లలో మినీ పార్కు ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ హరికృష్ణ మాట్లాడుతూ మంత్రి ఆర్కే రోజా అభ్యర్థన మేరకు పుత్తూరు పట్టణంలో పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. రెండున్నర ఎకరాల స్థలానికి నాలుగు వైపులా రోడ్డును ఏర్పాటు చేసి, లోపలి భాగాన కాంపౌండ్ వాల్‌ను నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డికి సూచించారు. అలాగే 59 సెంట్ల భూమి వద్ద సైతం కాంపౌండ్ వాల్ నిర్మించాలని స్పష్టం చేశారు. అనంతరం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని చెప్పారు. ఇప్పటికే మంత్రి ఆర్కే రోజా చొరవతో 18వ వార్డులో తుడా నిధులు రూ.1.10 కోట్లతో వైఎస్సార్ మున్సిపల్ పార్కును ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తుడా సెక్రెటరీ రాధిక, పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.శంకర్, కౌన్సిలర్ కేసీ.ఏకాంబరం, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈ సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.